క్లుప్తంగా

సారు లేక పరేషాన్

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ లేకపోవడంతో 84 విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. జూన్ 30న తెలుగు టీచర్ శ్రీవాణి పదవీవిరమణ పొందారు. అప్పటి నుంచి తెలుగు టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. కేశవపట్నం స్కూల్‌లో 130, తాడికల్‌లో130, కన్నాపూర్ పాఠశాలలో 84మంది విద్యార్థులు ఉండగా మిగతా పాఠశాలల్లో 50 మించికి విద్యార్థులు లేరు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ఈఏడాది 25 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. తెలుగు టీచర్ లేకపోవడంతో విద్యార్థులు వెనకబడిపోతారని తెలుగు టీచర్‌ను కేటాయించాలని జిల్లా విద్యాధికారిని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, టీచర్లు

గన్నేరువరం: టాటా కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థులకు స్మార్ట్ ఇండియాను రూపుదించడంలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి శ్రీజ, రెండో బహుమతి మనస్వీ, మూడో బహుమతి రామ్ చరణ్, జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి కీర్తి, రెండో బహుమతి దీక్షిత, మూడో బహుమతి శ్రీజ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు, టాటా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు బహూకరణ


ఫ్యాన్లు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎనిమిది ఫ్యాన్లు అందజేశారు. నాలుగు రోజుల క్రితం గురుకుల విద్యాలయాన్ని సందర్శించగా విద్యార్థులు సమస్యలను మొరపెట్టుకున్నారు. ఫ్యాన్లు లేక దోమలతో ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు, స్పందించిన రవిశంకర్ మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో ఫ్యాన్లు పంపించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



మందులు అందిస్తున్న నాయకులు, వైద్యులు

హుజూరాబాద్: పట్టణంలోని 23వ వార్డులో మంగళవారం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్, సుసన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తోటపల్లి ఎలీషా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 412 మందికి ఉచితంగా రక్త, బీపీ, షుగర్, ఎక్స్‌-రే, ఈసీజీ, దంత, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణచందర్, శంతన్‌రెడ్డి, నాగరాజు, వైద్యులు వాణి, భరత్, అజయ్, మనోజ్ఞ, తిప్పారపు శ్రీనివాస్, సిబ్బంది కుసుమ, స్వామి, సామ్యేల్, నరసింహ, సన బేగం, రవి, సుబ్రహ్మణ్యం, జయరాజు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

గన్నేరువరం: మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ)యూనియన్ సభ్యత్వ నమోదు, రెన్యూవల్‌ను మంగళవారం సంఘం మండల అధ్యక్షుడు మ్యాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పత్రికలకు చెందిన 14 మంది పాత్రికేయులు నూతన సభ్యత్వం, రెన్యూవల్ చేసుకున్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు బద్దం రమణారెడ్డి, గువ్వల తిరుపతి, ఎలుక రాజు, బూర తిరుపతి, శ్రీనివాస్, తెల్ల రవీందర్, బుర్ర రాజ్ కోటి, వీరకుమార్, అంజయ్య, లక్ష్మణ్, చంద్రశేఖర్‌గౌడ్, తుమ్మ సతీశ్, నూనె నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మానకొండూర్: అగ్ని ప్రమాదాల నివారణపై ఫైర్ సిబ్బంది మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏం చేయాలో ఫైర్ ఆఫీసర్ బూదయ్య వివరించారు. ఇంట్లో వంట గ్యాస్ లీకేజీతో మంటలు వచ్చినప్పుడు బయపడకుండా తడి గుడ్డను సిలిండర్ చుట్టూ చుడితే మంటలు అదుపులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

యాంటీ నార్కొటిక్ ఏసీపీ ఉపేందర్


తిమ్మాపూర్: అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కొటిక్ ఏసీపీ ఉపేందర్ తదితరులు

తిమ్మాపూర్: విద్యార్థులు, యువత మత్తుకు దూరంగా ఉండాలని యాంటీ నార్కొటిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఉపేందర్ సూచించారు. మండలంలోని రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధి వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జాతీయ సేవా పథకం, తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్.. దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం నార్కొటిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణమూర్తి డ్రగ్స్ రకాలు, వాటితో కలిగే నష్టాల గూర్చి విద్యార్థులకు వివరించారు. తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కె.స్వామి మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసుల వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎల్ఎండీ ఎస్సై చేరాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాయినాథ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసైతే భవిష్యత్‌ను కోల్పోతారని, చేడు అలవాట్లు సమాజం, కుటుంబానికి హాని చేస్తాయన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు తెలిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆకుల సదానందం, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, శైలజ, త్రివేణి, జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తుపదార్థాల అనర్థాలు, సైబర్‌నేరాలపై పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించనున్నామని ఎస్సై రవి తెలిపారు.

పేదల పెన్నిధి కేసీఆర్

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పెన్నిధి అయ్యారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. చెల్పూర్, ఇంద్రనగర్ రాజపల్లి, రాంపూర్, రంగాపూర్, పోతిరెడ్డిపేట్, సిర్సపల్లి గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి షాలినీరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక శ్రీనివాస్, జమ్మికుంట చైర్‌పర్సన్ రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి లేఖ అందజేత


జాతీయజెండాతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాంపూర్‌లో ఎమ్మెల్యేకు పెద్దపల్లి సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్, స్థానిక ప్రధాన తపాలా సిబ్బంది జాతీయ జెండా అందించారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షకావత్ పంపిన ఉత్తరాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. పసునూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి పోస్టాఫీస్‌లో కేవలం రూ.25 రూపాయలకే జాతీయ జెండా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ జమ్మికుంట మోహన్, హుజూరాబాద్ పోస్ట్‌మాస్టర్ అమర్నాథ్‌రెడ్డి, డీపీ ఎం.యు.మహేందర్, తపాలా సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: గంగాధర ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీవో జనార్దన్, తహశీల్దార్ అనుపమారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మనోహర్, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రావు, నాయకులు పాల్గొన్నారు. గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంను ఎమ్మెల్యే సందర్శించారు. సమస్యలు పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన భవనం నిర్మాణం చేపట్టాలని కలక్టర్‌తో మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

● రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

జమ్మికుంట: బ్యాంక్ రుణాలతో ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి జీవన జ్యోతి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు.

చిగురుమామిడి: స్వశక్తి సంఘాల మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, పాడిపశువులు, పెరటికోళ్లు, పంపకం కోసం రుణాలను ఇస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చిగురుమామిడి ఎంపీడీవో ఖాజామొయినొద్దీన్ తెలిపారు. మంగళవారం చిగురుమామిడి రైతువేదికలో స్వశక్తి సంఘాల మహిళలకు పాడిపశువుల పెంపకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. పాడిపశువుల షెడ్ల నిర్మాణానికి ఈజీఎస్, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారి సాంబశివరావు మాట్లాడుతూ.. పాడిపశువులను ఇతర రాష్ట్రాలనుంచి కొనుగోలు చేసుకోవాలని, మేలు రకం జాతి పశువులతో పాల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు.

● రక్షణ కవచంపై శిక్షణ

చొప్పదండి: పట్టణంలోని గీత కార్మికులకు మంగళవారం కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మద్య నిషేధ అధికారి పి. శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి జి. అనిల్ ఆధ్వర్యంలో గౌడ సోదరులకు సేఫ్టీ మోకుపై అవగాహనతో పాటు వర్క్ షాప్ నిర్వహించారు. సేఫ్టీమోకు ఉపయోగించడంపై శిక్షకుల ద్వారా అవగాహన కలిగించారు. గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా వృత్తిని కొనసాగించడంపై పది మందికి అవగాహన కల్పించారు.

● విద్యార్థులకు ట్రాక్‌షూట్‌ల అందజేత

చొప్పదండి: మండలంలోని రెవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన డీఎస్పీ మావురం జితేందర్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ రాంరెడ్డి మంగళవారం రూ. 15 వేల విలువైన ట్రాక్ షూట్‌లను అందించారు. పాఠశాలకు తమవంతు సాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు.

● నియామకం

రామడుగు: మండల కేంద్రానికి చెందిన బసరవేణి లక్ష్మణ్ తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికయ్యారు. లక్ష్మణ్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ ప్రధానకార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన నమిలకొండ ప్రభాకర్ ఈసీ సభ్యునిగా ఎన్నికయ్యారు. లక్ష్మణ్, ప్రభాకర్‌ను తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఎన్నికల నిర్వాహకులు శ్రీకాంత్, హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ డాక్టర్ ప్రతిపాల్ సింగ్ సలూజ అభినందించారు. మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

● అసోసియేట్ ఫెలోషిప్ పురస్కారం

రామడుగు: మండలంలోని వెదిర పరిధి వెంకటగిరికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమెస్ట్రీ డాక్టర్ వర్కోలు మెహన్‌కు కేఎల్ యునివర్సిటీ అసోషియేట్ ఫెలోషిప్ పురష్కారానికి ఎంపిక చేసింది. యునివర్సిటీ ప్రిన్సిపాల్ ఎ. రామకృష్ణ పురస్కారం అందజేశారు. మోహన్‌ను యునివర్సిటీ అధ్యాపకులు, వెదిర గ్రామస్తులు అభినందించారు.

● మలిదశ పోరాటాలకు సిద్ధం కావాలి

వీణవంక: మలిదశ పోరాటాలకు రజకులు సిద్ధం కావాలని తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో రజకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు రజక సమస్యలను గుర్తించడంలో విఫలమయ్యాయని మండిపడ్డారు.యువతకు ఉపాధి కోసం రూ.పదిలక్షలు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్ కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జనగామ జిల్లాను చాకలి ఐలమ్మ జిల్లాగా పేరు మార్చాలని కోరారు. ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. రజకుల డిమాండ్ల పరిష్కారం కోసం మలిదశ ఉద్యమాన్ని చేపడుతామన్నారు.

● జెండాలు మారినా పాలన మారలేదు

జమ్మికుంట: రాష్ట్రంలో పార్టీల జెండాలు మారాయి కానీ పాలనలో మార్పురాలేదని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. పట్టణంలో మంగళవారం పార్టీ మండల కార్యదర్శి గజ్జి ఐలయ్యతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చిన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గులాబీ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటుందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు భవిష్యత్ ఉద్యమాల్లో ప్రజల పక్షాన ఉంటామన్నారు.

● బీమా సౌకర్యం వినియోగించుకోవాలి

హుజూరాబాద్: ప్రమాదవశాత్తు మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు, అంగవైకల్యానికి గురైన కార్మికులు ఈ శ్రమ్ కార్డు బీమా సౌకర్యం పొందాలని హుజూరాబాద్ కార్మికశాఖ సహాయ అధికారి చందన అన్నారు. మంగళవారం మాట్లాడుతూ... హుజూరాబాద్ పరిధిలోని ఈ శ్రమ్ కార్డు ఉండి లబ్ధి పొందే అవకాశం ఉన్నవారు దరఖాస్తులను 25వ తేదీలోగా సమర్పించాలని కోరారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో లభిస్తాయని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుని కుటుంబానికి రూ. రెండు లక్షలు, ప్రమాదవశాత్తు అంగవైకల్యం కలిగిన కార్మికునికి లక్ష రూపాయలు బీమా వర్తిస్తుందన్నారు.

● జీపీ రికార్డులు పరిశీలించిన ఎంపీడీవో

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామపంచాయతీ రికార్డులను మంగళవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల పనులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

● ఫీవర్ సర్వే

శంకరపట్నం: ఫీవర్‌సర్వే కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఫీవర్‌సర్వేపై ఆశా కార్యకర్తలకు వైద్యాధికారి శ్రావణ్ అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ఫీవర్, డెంగీ సర్వేపై సూచనలు చేశారు.

● మెలుకువలు పాటిస్తే దిగుబడులు

జమ్మికుంట: రైతులు వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతికత మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, ఈస్ట్ రీజనల్ మేనేజర్ సుభ్ర సుమన్ మహంతి(ఒడిస్సా) సూచించారు. మంగళవారం పట్టణంలోని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం)లో భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్)తో కృషి జాగరణ్‌ఒప్పందంలో భాగంగా దేశంలోని అన్ని కేవీకేల్లో వరి, పత్తి పంటల సాగులో మెలకువలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ట్రాక్టర్లు, యంత్ర పనిముట్లు, ధనూక ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్, విత్తనాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.


● బియ్యం అందజేత

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లె, చీమలకుంటపల్లె గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబసభ్యులను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం అందజేశారు.

● కక్షతోనే ప్రకృతి వనం ధ్వంసం

రామడుగు: గ్రామంలోని అభివృద్ధి పనులను ఓర్వలేకను కొందరు పనులకు అడ్డుపడుతున్నారని గోపాల్‌రావుపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెప్రకృతి వనంలోని చెట్లు నరికి వేయడం, క్రీడా వస్తువులను మరో స్థలంలో ఏర్పాటు చేశారని, నూతన జీపీ నిర్మాణం చేస్తే దాన్ని కక్షతోనే అడ్డుకున్నారని, మా ఇంటి ముందు ఓ దేవాలయ నిర్మాణ పనులు ఇబ్బదులకు గురయ్యేలా చేస్తున్నారని, ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ స్పందించడంలేదని వాపోయారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


మానకొండూర్‌లో జాతీయ జెండాలతో ర్యాలీ

జమ్మికుంట: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించడానికి ,దేశ స్వాతంత్రం కోసం అశువులు బాసిన ప్రతి ఒక్కరిని స్మరించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గుర్తు చేశారు.

మానకొండూర్: మానకొండూర్ హనుమాన్ దేవాలయం నుంచి తూర్పు దర్వాజ చౌరస్తా వరకూ జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పల్లెమీద చౌరస్తాలో మానవ హారం నిర్వహించి జాతీయగీతాలాపన చేశారు.


శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తా నుంచి విద్యార్థులు, బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

హుజూరాబాద్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. హుజూరాబాద్‌లోని ఇంటిపై జాతీయ జెండా ఎగరేశారు. పట్టణంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఇల్లందకుంట: ప్రతి ఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. బీజేవైఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అన్ని పార్టీల నాయకులు, యువత జాతీయ జెండాలతో ర్యాలీని నిర్వహించారు.

బ్రిడ్జి కోసం వంటావార్పు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామ మైసమ్మ గుట్ట నుంచి జిల్లా కేంద్రం కరీంనగర్ వరకు మానేరుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బిడ్జి సాధన కమిటీ(జేఏసీ) అధ్యక్షుడు సంపతి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో మైసమ్మ గుట్ట వద్ద మంగళవారం వంటావార్పు నిర్వహించారు. గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట ప్రజలు మద్దతు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో సర్వే చేపట్టి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు రామచందర్‌రావు, బాలయ్య, సత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి అంజిరెడ్డి, రాజేశం, తిరుపతి, వెంకటమల్లు, చింటూ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



రైల్వే సమాచారం

జమ్మికుంట నుంచి ప్రతిరోజు నడిచే రైళ్ల సమాచారం

జమ్మికుంట నుంచి కరీంనగర్, బల్లార్షా(ఎగువ) వైపు..		
12761:	తిరుపతి-కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(గురు, ఆదివారాలు)	05.26 గంటలకు
17003:	రామగిరి ఎక్స్‌ప్రెస్-కాజీపేట్-సిర్పూర్ టౌన్	06.05 గంటలకు
17011:	ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	07.55 గంటలకు
17033:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్-భద్రాచలం రోడ్ టూ బల్లార్షా	10.01 గంటలకు
12757:	కాగజ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	10.43 గంటలకు
12721:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-హైదరాబాద్ టూ హజరాయ్ నిజామోద్దీన్	(రాత్రి)1.44 గంటలకు
12771:	రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ రాయ్‌పూర్ జంక్షన్	(రాత్రి)1.04 గంటలకు
12791:	ధానాపూర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ ధానాపూర్	11.34 గంటలకు
16093:	లక్నో ఎక్స్‌ప్రెస్(బుధ, శని)-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో జంక్షన్	18.08 గంటలకు
16031:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, బుధ, గురువారాలు)- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ టూ లక్నో	18.08 గంటలకు
17233:	భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్-సికింద్రాబాద్ టూ సిర్పూర్ కాగజ్‌నగర్	18.25 గంటలకు
17035:	కాజీపేట్ బల్లార్షా ఎక్స్‌ప్రెస్-కాజీపేట్ టూ బల్లార్షా	23.18 గంటలకు
12592:	యశ్వంత్‌పూర్ టూ గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(మంగళవారం)	08.55 గంటలకు
జమ్మికుంట నుంచి కాజీపేట్, వరంగల్(దిగువ) వైపు..		
12772:	రాయ్‌పూర్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-రాయ్‌పూర్ టూ సికింద్రాబాద్	04.11 గంటలకు
17234:	భాగ్యనరగ్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	05.44 గంటలకు
17036:	బల్లార్షా కాజీపేట్ ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్	07.20 గంటలకు
17012:	ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	13.55 గంటలకు
17034:	సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్	14.45 గంటలకు
16032:	అండమాన్ ఎక్స్‌ప్రెస్(ఆది, సోమ, గురు)- శ్రీమాతా వైష్ణోదేవి కత్రా టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	15.34 గంటలకు
16094:	లక్నో ఎక్స్‌ప్రెస్ (మంగళ, శుక్ర)- లక్నో జంక్షన్ టూ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్	16.09 గంటలకు
12758:	కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్-సిర్పూర్ కాగజ్‌నగర్ టూ సికింద్రాబాద్	16.30 గంటలకు
12792:	సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్-దానాపూర్ టూ సికింద్రాబాద్ 1	7.42 గంటలకు
12722:	దక్షిణ్ ఎక్స్‌ప్రెస్-నిజామోద్దీన్ టూ హైదరాబాద్ జంక్షన్	23.19 గంటలకు
17004:	రామగిరి ఎక్స్‌ప్రెస్-బల్లార్షా టూ కాజీపేట్	19.09 గంటలకు
12762:	కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్(గురు, ఆది) కరీంనగర్ టూ తిరుపతి	20.24 గంటలకు
12591:	గోరఖ్‌పూర్ టూ యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(ఆదివారం)	10.09 గంటలకు



కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

చిగురుమామిడి: మండలంలోని రోడ్లు కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్నాయి. లక్షలు వెచ్చించి రోడ్లు నిర్మిస్తే ఇష్టారాజ్యంగా ధ్వంసం చేస్తున్నా అడిగేవారు కరువయ్యారని వాపోతున్నారు. పుల్ కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై వెళ్లడం వల్ల బీటీ లేస్తుందని, ఫలితంగా గుంతలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను ధ్వంసం చేస్తున్న వారిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి.. మా ఫోన్ నంబర్ : 87901 44227

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్: మండలంలోని కేజీబీవీలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్‌కు పదో తరగతి, అసిస్టెంట్‌కుక్‌కు ఏడో తరగతి చదివినవారు అర్హులని 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి, ఇప్పలపల్లి, చల్లూరు, కిష్టంపేట, లస్మక్కపల్లి, నర్సింగాపూర్, వల్బాపూర్, బేతిగల్, కనపర్తి గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం పంపిణీ చేస్తారని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పీఆర్సీ అమలు చేయాలి

జమ్మికుంట: పీఆర్సీ, పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అవాల నరహరి అన్నారు. మంగళవారం పట్టణంలో డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో 2024-25 సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్జీటీ ప్రమోషన్లలో అన్యాయం జరిగిందని, దిద్దుబాటుగా ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పోస్టు కేటాయించి బీఎడ్ అర్హత కలిగిన ఎస్జీటీలకు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మిగిలిన పండిట్, పీఈటీలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మందారపు సదానందం, వేల్పుల రత్నం, వేణు, రాజిరెడ్డి, రాజయ్య, సదానందం, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామివారికి సమర్పించేందుకు ఇత్తడి తొడుగు తీసుకొస్తున్న దేవేందర్‌రెడ్డి, తదితరులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం అర్చకులు డింగరి దిలీప్‌కుమాచార్యులు, శేషాచార్యులు, గోవర్ధనశ్రీహర్షచార్యులు స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, గణపతిపూజ, పుణ్యావచనం రక్షాబంధనం, నవకలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నల్ల దేవేందర్‌రెడ్డి-కరుణ దంపతులు స్వామివారికి ఇత్తడి తొడుగు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, శ్రీరామసేవాసమితి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న ఆలయాల పునర్నిర్మాణ పనులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని శ్రీహనుమాన్ దేవాలయం, పోచమ్మ, నల్ల పోచమ్మ దేవాలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామానికి చెందిన కుల సంఘాలు, నేచర్ యూత్ క్లబ్ సభ్యులు దాతల సహాయంతో విరాళాలు సేకరించారు. వారం రోజులుగా ఆలయాల పునఃనిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక సహాయం చేసిన వారికి దేవాలయాల నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ధన్యావాదాలు తెలియజేశారు.